క్లుప్తంగా

బాలసదనానికి రగ్గులు వితరణ



బాలసదనం సిబ్బందికి రగ్గులు అందజేస్తున్న సన్యాసిపాత్రుడు, సంఘ ప్రతినిధులు

నర్సీపట్నం: ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం గౌరవాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు బాలసదనం సూపరింటెండెంట్ సిహెచ్. వరలక్ష్మికి నర్సీపట్నంలో రగ్గులు అందజేశారు. స్త్రీ శిశు, సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చింతపల్లిలో నిర్వహిస్తున్న బాలసదనంలో 50 మంది బాలికలకు వీటిని వితరణ చేశారు. జూనియర్ కళాశాలకు చెందిన 1977–79 ఇంటర్మీడియట్ బ్యాచ్ విద్యార్థులు సంఘంగా ఏర్పడి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని సన్యాసిపాత్రుడు పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ జీకేఆర్ కుమార్‌బాబు, సినీ నిర్మాత కర్రి రాంగోపాల్, పిట్టా శ్రీనివాస్, గణేష్, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా చిల్డ్రన్ క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

మాకవరపాలెం: స్థానిక పెంతుకొస్తు ప్రార్థనా మందిరంలో శనివారం చిల్డ్రన్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు వివిధ గ్రామాలకు చెందిన చిన్నారులు హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని ఆనందంగా గడిపారు. పాస్టర్లు విక్టర్‌పాల్, టి.వి.రత్నం పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితా లక్ష్యం



బీఎల్వోలతో సమీక్షిస్తున్న ప్రమీలాగాంధీ

రావికమతం: తప్పులు లేని ఓటరు జాబితా మనందరి లక్ష్యమని, ఇంటింటికి తిరిగి విచారణ చేసి అనర్హత ఓట్లు తొలగించాలని నియోజక వర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి ప్రమీలాగాంధీ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి రవికిరణ్‌తోపాటు అధికారులు, ఫీల్డ్ సిబ్బందితో శనివారం ఆమె సమీక్షించారు. మండలంలో కొత్తగా ఓటు నమోదుకు, తొలగింపు, మైగ్రేటెడ్‌కు సంబంధించి 3,400కు పైగా దరఖాస్తులు వచాయన్నారు. బీఎల్వోలతోపాటు ఫీల్డ్ అధికారులు ఇంటింటికి తిరిగి మృతి చెందిన వారి పేర్లను, వలస వెళ్లిన వారి పేర్లను కచ్చితంగా తొలగించాలన్నారు. అర్హులెవ్వరూ ఓటు రాలేదనే ప్రశ్న రాకూడదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్వరరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఏలేరు కాలువకు గండి



పొక్లెయిన్‌తో కాలువ గండి కప్పుతున్న దృశ్యం

నాతవరం: గుర్తుతెలియని కొంతమంది వ్యక్తులు ఏలేరు కాలువకు గండి కొట్టిన ప్రాంతాన్ని మరమ్మతులు చేస్తున్నామని విస్కో జేఈ నానాజీ తెలిపారు. ఇటీవల తుపాను వర్షాలకు ముంపు వాటిల్లుతుందన్న భయంతో ఏలేరు కాలువ 61వ కిలోమీటరు వద్ద గండి కొట్టేశారు. ఈ మేరకు మండలంలోని ఎం.బి.పట్నం శివారు ఎ.శరభవరం వద్ద ఏలేరు కాలువకు ఏర్పాటు చేసిన లాకులు వద్దకు కొట్టుకొచ్చిన చెత్తను వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి వెంకటరమణ, గ్రామస్తులు ఆయనకు చూపించారు. ఈ మేరకు వెంటనే మరమ్మతుల చర్యలు చేపట్టారు. వాస్తవంగా ఏలేరు కాలువ నీటి వల్ల ముంపు ఏర్పడకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. ఇది తెలియక కాలువకు గండి కొట్టేశారు. దాంతో స్వల్పంగా కాలువ కాలువ కోతకు గురైంది. ఈ మేరకు పొక్లెయిన్‌తో పూడ్చివేత చర్యలు చేపట్టారు.

హైటెక్ స్కూళ్లు

ఒకప్పుడు చాలీచాలని తరగతి గదులు, పూరిపాకల్లోనూ, చెట్ల కిందా బోధన, చిన్నపాటి వర్షం పడితే కారిపోయే భవనాలు, గదిలో నుంచి బయటకు అడుగుపెడితే అధ్వానంగా బురద, మరుగుదొడ్లు లేక బాలికలు ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితిలో ఉండే ప్రభుత్వ హైస్కూళ్లు నేడు డిజిటల్ బోధన, మినరల్ వాటర్ ప్లాంట్, వెస్టన్ మరుగుదొడ్లు వంటి అధునాతన సౌకర్యాలతో ఆహ్వానం పలుకుతున్నాయి. స్వాతంత్ర్య వచ్చిన దగ్గర నుంచి ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం చేయలేని రీతిలో నాడు – నేడు నిధులతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసిందని విద్యార్థుల తల్లిదండ్రులే చెబుతున్న మాటలివి....

చోడవరం: జిల్లాలోనే చోడవరం పట్టణంలో జెడ్పీ బాలికోన్నతతోపాటు, లక్ష్మీపురం హైస్కూళ్లు ఆదర్శంగా నిలుస్తున్నాయి. నాడు–నేడు పథకం నుంచి రూ. 2.75 కోట్లతో ఈ రెండింటిని అభివృద్ధి చేశారు. దీంతో రూపురేఖలు మారాయి. ఇప్పుడు సుందర వనంగా ఎంతో చక్కని సౌకర్యాలతో విద్యార్థులకు వరమయ్యాయి. విద్యా బోధనతో పాటు అన్ని హంగులతో మెరుగైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది.

గర్ల్స్ హైస్కూల్‌లో విద్యార్థినులు	-720
మొత్తం గ్రాంట్ -రూ.	67 లక్షలు
కొత్తగా నిర్మించిన వంటగదులు-	2
స్టేజీ-	1
సైకిల్ షెడ్-	1
వెస్టన్ మరుగుదొడ్లు-	8
సాధారణ మరుగుదొడ్లు-	8
యూరినల్స్ యూనిట్లు-	8
లాంజెస్ రూమ్స్-	2
గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్-	2
ఆర్వో ప్లాంట్ -	1
ఐబీఎఫ్ డిజిటల్ క్లాస్ రూమ్‌లు-	11
వాటర్ ట్యాంక్-	1
అన్ని క్లాస్‌రూమ్‌ల ఫ్లోరింగ్, విద్యుత్ సౌకర్యం, లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు	
గ్రౌండ్ మొత్తం పాత్ వే ఏర్పాటు	
మెడికల్ యూనిట్ -	1
అన్ని బిల్డింగ్‌లకు రంగులు	
నీటి హ్యాండ్ వాష్‌లు -	4 యూనిట్లు, 40 ట్యాప్‌లు ఏర్పాటు
విద్యార్థినుల క్లాస్ టేబుళ్లు -	250
బీరువాలు-	10
విద్యార్థినులు, టీచర్లకు ట్యాబ్‌లు-	108

వర్షం వస్తే కారిపోయేవి...



ఇంతకు ముందు మా లక్ష్మీపురం హైస్కూల్‌లో గదులు లేక పూరిపాకలు కట్టి అందులో పాఠాలు చెప్పేవారు. పెద్ద వర్షం వస్తే అవి కారిపోయి పిల్లలు చాలా ఇబ్బంది పడేవారు. మా అబ్బాయి, అమ్మాయి ఇక్కడే చదువుతున్నారు. నాడు – నేడు నిధులతో అధునాతనంగా తరగతి గదులు కట్టారు. చూడముచ్చటగా బెంచీలు ఉన్నాయి. ట్యాబ్‌లు ఇచ్చారు. ప్రైవేటు స్కూల్ కంటే దీటుగా బాగుంది.

– శిరుచోళ్ల భవానీ, విద్యార్థిని తల్లి, హైస్కూల్ లక్ష్మీపురం

అన్ని సదుపాయాలు కల్పించారు



నేను ఆరో తరగతిలో చేరేటప్పుడు మా స్కూల్‌లో గ్రౌండ్ చాలా బురదగా ఉండేది. వర్షం పడితే మా టీచర్లు, మేము జారి పడిపోయేవాళ్లం. ఇప్పుడు గ్రౌండ్ ఫ్లోరింగ్ చేశారు. మల, మూత్ర విసర్జనకు వెళ్లడానికి ఇబ్బందిపడేవాళ్లం. ఇప్పుడు యూరినల్స్ బేషిన్లు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. డిజిటల్ క్లాస్ రూమ్‌లో ఆన్‌లైన్ విద్య చెబుతున్నారు. మా స్కూల్ చాలా బాగుంది.

– లోకశ్రీ, విద్యార్థిని, గర్ల్స్ హైస్కూల్, చోడవరం

నాడు- నేడులో రాష్ట్ర స్థాయి పురస్కారం



నా ఇద్దరు ఆడపిల్లలు చోడవరం గర్ల్స్ హైసూల్‌లోనే చదివారు. నాలుగేళ్ల కిందట ఎటువంటి సౌకర్యాలు ఉండేవి కావు. ఇప్పుడు నాడు–నేడు నుంచి రూ. 67 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులతో స్కూల్ రూపురేఖలు మారిపోయాయి. గ్రౌండ్ దగ్గర నుంచి కుళాయిల వరకు పనులన్నీ నాణ్యతతో చేశాం. దీన్ని గుర్తించి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పాఠశాల అవార్డు వచ్చింది. విప్ కరణం ధర్మశ్రీ కృషితో నిధులు మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– దేవరపల్లి కుమారి, పేరెంట్, రాష్ట్ర ఉత్తమ విద్యా కమిటీ చైర్మన్ అవార్డు గ్రహీత, చోడవరం గర్ల్స్ హైస్కూల్

చెట్ల కింద చదువులకు గుడ్‌బై...

ఒకనాడు పూరిపాకలు...నేడు పక్కా భవనాలు

జిల్లాలో ఆదర్శంగా చోడవరం, లక్ష్మీపురం హైస్కూళ్లు



చోడవరం గర్ల్స్ హైస్కూల్ మెయిన్ గేటు వద్ద బురదలో ఇబ్బందిగా నడుస్తున్న విద్యార్థినులు, టీచర్లు (నాడు)





చోడవరంలో కొత్త హంగులతో సిద్ధమైన స్కూల్ తరగతి గదులు, ప్రాంగణం (నేడు)



లక్ష్మీపురం హైస్కూల్‌లో తరగతి గదులు లేక పూరిపాకల్లో పాఠాలు చెబుతున్న దృశ్యం (నాడు)



లక్ష్మీపురంలో నాడు- నేడు నిధులతో కొత్తగా నిర్మించిన తరగతి గదుల సముదాయం (నేడు)













లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్

పాఠశాలలో విద్యార్థులు -471
నాడు- నేడులో మొత్తం గ్రాంట్ -రూ.2.8 కోట్లు
అదనపు తరగతి గదులు -9
మరుగుదొడ్లు -10
యూరినల్స్-20
మోటార్లు-2
ఓవర్‌హెడ్ ట్యాక్‌లు-2
హెడ్‌వ్యాష్-3 యూనిట్లు, 30ట్యాప్‌లు
ఐఎఫ్‌బీలు డిజిటల్ బోర్డులు-9 (ఆన్‌లైన్ క్లాస్‌ల కోసం)
క్లాస్ రూమ్‌లు ఫ్లోరింగ్-16 గదులు
పాత్ వే ఫ్లోరింగ్ నిర్మాణం
సైకిల్ స్టాండ్ ఏర్పాటు
మంచినీటి ట్యాప్‌లు-10
క్లాస్ టేబుళ్లు (ప్యూయల్ డస్కులు)-200
ట్యాబ్‌లు -118

ఘనంగా గైరమ్మ సారె ఊరేగింపు



సారె ఊరేగింపులో ఎడ్ల బండి తోలుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



శాలిపేట వద్ద అన్నసమారాధనలో భక్తులు


- ఎడ్ల బండి తోలి ఆకట్టుకున్న డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి: గౌరీ పరమేశ్వర్ల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం దేవరాపల్లిలో గౌరమ్మ సారె ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. ఇక్కడ రామాలయం వద్ద నెలకొల్పిన గౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొని ఎడ్ల బండి తోలి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముందుగా ప్రత్యేక పూజలు చేసిన ఆయనకు ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి, గౌరీ పరమేశ్వరుల చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం ఊరేగింపులో వివిధ రకాల పిండి వంటలు, పండ్లు, తదితర ఫలహారాలతో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని గైరమ్మకు సమర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వి. సింహాచలం నాయుడు, మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, మహిళా అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, కోఆపరేటివ్ డైరెక్టర్ వరదపురెడ్డి లలితానాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, వేచలపు అప్పలనాయుడు, సోమిరెడ్డి పేరునాయుడు తదితర గ్రామ పెద్దలు, గౌరీ పరమేశ్వర్ల యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కె.జె.పురంలో అన్నసమారాధన

మాడుగుల రూరల్: కె.జె.పురంలో శాలిపేట చావిడి వద్ద గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి సారె ఊరేగింపు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. రాత్రికి మహిళల కోలాటం, సాముగరిడీల మధ్య అమ్మవారి నిమజ్జనోత్సవం నిర్వహించారు. గ్రామ కళావేదిక వద్ద నెలకొల్పిన గౌరీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాన్ని పుర వీధుల్లో ఊరేగించారు.

పౌష్టికాహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం వద్దు



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సీతారామలక్ష్మి



కె.జె.పురం పీహెచ్‌సీలో గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యాధికారి లీలాప్రసాదు

మాకవరపాలెం: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం చేయొద్దని వైద్యాధికారి సీతారామలక్ష్మి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో శనివారం పీఎంఎస్‌ఎంఏవైలో భాగంగా గర్భిణులను ఆమె పరీక్షించారు. బీపీ, సుగర్, రక్తహీనతకు సంబంధించి మొత్తం 50 మందిని పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం తల్లీబిడ్డ ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సీహెచ్‌వో అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు

మాడుగుల రూరల్: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ యోజనలో భాగంగా కె.జె.పురం పీహెచ్‌సీలో శనివారం గర్భిణులను వైద్యాధికారి లీలాప్రసాదు పరీక్షించారు. వారి ఆరోగ్య జాగ్రత్తలు, వ్యక్తిగత శుభ్రత గురించి ఈ సందర్భంగా సీహెచ్‌సీ సిహెచ్. పుష్పమ్మ వివరించారు. పీహెచ్‌ఎన్ ఇందిర, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. కింతలి పీహెచ్‌సీలోనూ ఈ కార్యక్రమం నిర్వహించారు.

'ఉపాధి పనులు ప్రారంభించాలి'

నర్సీపట్నం: ప్రతి గ్రామంలో వేతనదారుల జీవనానికి ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వి.అర్జున్‌రావు కోరారు. ఈ నెల 14న విజయవాడలో తలపెట్టే గ్రామీణ కష్టజీవుల ధర్నా కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.24 వేల కోట్లు కేటాయించాలన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఉపాధి హామీ పనులు సక్రమంగా జరగాలంటే మేట్ల వ్యవస్థను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రామునాయుడు, శివలంక కొండలరావు పాల్గొన్నారు.

వరి కంకులపై ఉప్పు ద్రావణం పిచికారీ



ఎం. కోటపాడులో రైతులతో ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయిస్తున్న ఏవో

మాడుగుల: నేలకు ఒరిగి తడిచిన వరి కంకులపై ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయడం వల్ల మొలకెత్తదని ఏవో వాసుదేవరావు తెలిపారు. కేజేపురం, సాగరం, ఎం.కోటపాడు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి పై విధంగా రైతులకు అవగాహన కల్పించారు. పంట నష్టాన్ని ప్రాథమిక అంచనా వేసి ఉన్నతాధికారులకు పంపించామన్నారు. ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు పాల్గొన్నారు.

తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

- రూ.2.80 కోట్లు మంజూరు చేసిన డిప్యూటీ సీఎం



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్‌లు దాడి జగన్, కర్రి సూరినాయుడు

దేవరాపల్లి: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో ఎం. అలమండ – మామిడిపల్లి గ్రామాల మధ్య రోడ్డు సమస్యకు మోక్షం కలిగింది. కనీసం నడవడానికి వీలులేని 4.5 కిలోమీటర్ల మేర మట్టిరోడ్డును బీటీ రోడ్డుగా నిర్మించేందుకు రూ 2.80 కోట్లు మంజూరు చేశారు. ఈ నిర్మాణ పనులకు ఎం. అలమండ వద్ద సర్పంచ్‌లు దాడి జగన్, కర్రి సూరినాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు పోతల లక్ష్మి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దశాబ్దాల కల నెరవేర్చిన డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపీటీసీ పోతల వెంకటరావు, వీఆర్వో పోతల శంకరరావు, పాల సంఘం అధ్యక్షుడు పాలిపిరెడ్డి రమణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బండారు ప్రసాదరావు, రైతులు పాల్గొన్నారు.

నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ అండ

- చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గణేష్



బాధిత కుటుంబాలకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని నలుగురికి రూ.4.82 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో నియోజకవర్గానికి కోట్ల రూపాయలు సీఎం సహాయనిధి ద్వారా మంజూరు చేయించామన్నారు. పేదలందరినీ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆదుకుంటోందన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలో లేని జబ్బులకు వైద్యం చేయించుకున్న వారికి బిల్లులు ఇస్తే, తన లెటర్ హెడ్ ద్వారా సీఎం సహాయనిధి కోసం రెఫర్ చేస్తున్నానన్నారు. నాతవరం మండలానికి చెందిన మాసారపు పార్వతికి రూ.16 వేలు, జక్కంశెట్టి సిరిప్రియకు రూ.18 వేలు, చెవల లోవరాజుకు రూ.90 వేలు, రుత్తల అపర్ణకు రూ.3.30 లక్షలు, ఇనపసప్పల గురువులమ్మకు రూ.28 వేల చొప్పున మొత్తం రూ.4.82 లక్షలు మంజూరయ్యాయి. నాతవరం మండలం ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

గౌరీపర్వమేశ్వరుల సేవలో ఎమ్మెల్యే

నర్సీపట్నం: మున్సిపాలిటీ 27వ వార్డు శివపురంలో ప్రతిష్ఠించిన గౌరీపరమేశ్వరులను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ శనివారం దర్శించుకున్నారు. ఇక్కడ ఉత్సవాల్లో భాగంగా ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ పట్టణాధ్యక్షుడు ఏకా శివ, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీను, కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం, పార్టీ యూత్ అధ్యక్షుడు ధనిమిరెడ్డి ప్రసాద్, వార్డు ఇన్‌చార్జి వరలక్ష్మి, నాయకులు బేతిరెడ్డి విజయ్ పాల్గొన్నారు.

రిటైర్డ్ వైద్యాధికారి మృతికి సంతాపం



విజయకుమారి(ఫైల్)

రోలుగుంట: స్థానిక పీహెచ్‌సీలో పదవీ విరమణ పొందిన వైద్యురాలు పల్నాటి విజయకుమారి మృతికి పలువురు సంతాపం తెలిపారు. అనారోగ్యంతో విశాఖలోని ఓ ఆస్పత్రిలో ఆమె చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. రోలుగుంటలో నాలుగేళ్ల క్రితం పదవీ విరమణ చేసిన తర్వాత నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో స్వచ్ఛంద సేవా వైద్యురాలి చేరారు. అప్పటి నుంచి వైద్య సేవలందిస్తున్న ఆమె ఆకస్మిక మృతి పట్ల రోలుగుంట వైద్యులు ధనలక్ష్మి, శ్రావణి, ఎంపీహెచ్ఈవోలు కృష్ణ, సురేష్, సిబ్బంది, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ, పార్టీ మండలాధ్యక్షుడు గొర్లె వెంకటరమణ సంతాపం ప్రకటించారు.